క్లుప్తంగా

పరామర్శ



రామునాయుడు కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న మంత్రి బొత్స

చీపురుపల్లిరూరల్(గరివిడి): గరివిడి మండలంలోని దుమ్మెద గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ ఎలకల రామునాయుడు ఇటీవల మృతిచెందారు. రాష్ట్ర విద్యాశాఖామంత్రి బొత్స సత్యనారాయణ దుమ్మెద గ్రామానికి సోమవారం వెళ్లి మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించారు. రామునాయుడు కుమారులు సత్యం, అప్పలనాయుడుతో మాట్లాడి అండగా ఉంటామని ధైర్యం చెప్పారు. పరామర్శించిన వారిలో ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, చీపురుపల్లి,గరివిడి మండల నాయకులు ఉన్నారు.

డేటా ఎంట్రీ కోర్సులపై ఉచిత శిక్షణ

శృంగవరపుకోట: ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ నేతృత్వంలో స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నడుస్తున్న స్కిల్‌హబ్‌లో డేటా ఎంట్రీ ఆపరేటర్ కోర్సుపై ఉచిత శిక్షణ ఇస్తున్నట్టు ప్రిన్సిపాల్ సీహెచ్.కేశవరావు, కో–ఆర్డినేటర్ జి.ఈరన్న సోమవారం తెలిపారు. 10వ తరగతి, ఇంటర్, డిగ్రీ, ఐటీఐ చదివిన 18 నుంచి 28 యేళ్ల మధ్య వయస్సున్న యువతీ ,యువకులు అర్హులని చెప్పారు. మూడు నెలల శిక్షణ పూర్తిచేసుకున్న అభ్యర్థులకు ప్రముఖ కంపెనీల్లో ఉద్యోగవకాశాలు కల్పిస్తామన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు మంగళవారం కళాశాలకు వచ్చి తమ పేర్లు నమోదు చేసుకోవాలని, ఏప్రిల్ 5వ తేదీ నుంచి శిక్షణా తరగతులు ప్రారంభమవుతాయని తెలిపారు.

ఘనంగా గ్రంథాలయ వార్షికోత్సవం



గంగరాజమ్మ విగ్రహం వద్ద నివాళి అర్పిస్తున్న గ్రామపెద్దలు, యువకులు

వేపాడ: మండలంలోని దబ్బిరాజుపేటలో ఏడువాక గంగరాజమ్మ మెమోరియల్ గ్రంథాలయం వార్షికోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. గంగ రాజమ్మ విగ్రహానికి నిర్వాహకులు గ్రామపెద్దలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. గ్రామానికి చెందిన పలువురు ఉద్యోగులు మాట్లాడుతూ దాత ఏడువాక కిత్తంనాయుడు దంపతుల సహకారంతో ఏర్పాటుచేసిన గ్రంథాలయం పోటీపరీక్షలకు సిద్ధమయ్యే వారికి ఎంతో ఉపయోగపడుతోందని చెప్పారు.

నేత్రవైద్యశిబిరం



నేత్రవైద్యశిబిరం నిర్వహిస్తున్న వైద్యసిబ్బంది

శృంగవరపుకోట: వైఎస్సార్ కంటివెలుగు కార్యక్రమంలో భాగంగా మండలంలోని తలారి సచివాలయం పరిధి చుక్కవానిపాలెం గ్రామంలో సోమవారం నేత్ర వైద్యశిబిరం నిర్వహించారు. ఆప్తాలమిక్ అసిస్టెంట్ అనుపమ 93 మందికి కంటి పరీక్షలు చేశారు. శస్త్రచికిత్సలు అవసరమైన వారిని విజయనగరం కేంద్రాస్పత్రికి రిఫర్ చేశారు. అవసరమైన వారికి ఉచితంగా కంటి అద్దాలు అందిస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఏఎన్ఎం రమణమ్మ, ఎంఎల్‌హెచ్‌పీ, ఆశ వర్కర్లు సేవలందించారు.

చేతులశుభ్రతపై అవగాహన



విద్యార్థులకు చేతుల శుభ్రతపై అవగాహన కల్పిస్తున్న డాక్టర్ సాయికృష్ణ

గజపతినగరం రూరల్: చేతులను పరిశుభ్రంగా ఉంచుకోవడం వల్ల వ్యాధులకు దూరంగా ఉండవచ్చని మరుపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి సాయికృష్ణ అన్నారు. గుమడాం గ్రామంలో సోమవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. స్థానిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాల్లో విద్యార్థులు, చిన్నారులకు వైద్య పరీక్షలు చేసి చేతుల పరిశుభతపై అవగాహన కల్పించారు. అంతకుముందు సచివాలయంలో వైద్యశిబిరం నిర్వహించి 45 మందికి వివిధ వైద్య పరీక్షలు చేసి అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. అనంతరం గృహసందర్శన చేసి ప్రజలకు వైద్యతని ఖీలు చేశారు. ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

ఏప్రిల్ 1న ద్విచక్ర వాహనం వేలం

చీపురుపల్లి: మద్యం అక్రమ రవాణా కేసులో సీజ్ చేసిన ద్విచక్ర వాహనాన్ని స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఏప్రిల్ 1న బహిరంగ వేలం వేయనున్నట్లు ఎస్ఐ ఎ.సన్యాసినాయుడు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. 2020 ఏప్రిల్ 8న మద్యం సీసాలు అక్రమంగా రవాణా చేస్తున్న సమయంలో ఏపీ 30 ఏఎం 2629 నంబర్ ద్విచక్ర వాహనంపై కేసు నమోదు చేసి సీజ్ చేశామని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న వారు బహిరంగ వేలంలో పాల్గొనవచ్చని సూచించారు.

మహిళా సాధికారతే సీఎం జగన్ లక్ష్యం



అక్క చెల్లమ్మలకు ఆసరా చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు,ఇతర ప్రజా ప్రతినిధులు

- వైఎస్సార్ ఆసరా సంబరాల్లో ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు



హాజరైన డ్వాక్రా సంఘాల సభ్యులు

కొత్తవలస: మహిళా సాధికారతే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు అన్నారు. డ్వాక్రా సంఘాల సభ్యులకు వైఎస్సార్ ఆసరా మూడో విడత నిధులను సీఎం జగన్ తాజాగా విడుదల చేసిన సందర్భంగా స్థానిక కల్యాణ మండపంలో సంబరాలు సోమవారం ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా నిర్వహించిన సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన వెంటనే మహిళా సంఘాలకు 2019 ఎన్నికల నాటికి ఉన్న రుణం మొత్తాన్ని నాలుగు విడతల్లో అందిస్తామని ఎన్నికల ముందు జగన్‌మోహన్‌రెడ్డి చెప్పారని గుర్తుచేశారు. ఇచ్చినమాట ప్రకారం ఇప్పటి వరకు సీఎం జగన్ మూడు విడతల్లో రాష్ట్ర వ్యాప్తంగా డ్వాక్రా సంఘాలకు రూ.19,178 కోట్లు అందజేశారని చెప్పారు. ఎస్.కోట నియోజకవర్గంలోని అక్క,చెల్లెమ్మలకు బాసటగా మూడు విడతల్లో రూ.155 కోట్లు జమ చేశారని తెలిపారు. ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్‌రెడ్డి బాధ్యతలు స్వీకరించిన నాటి నుంచి వివిధ పథకాల ద్వారా ఎస్.కోట నియోజకవర్గంలోని లబ్ధిదారుల ఖాతాల్లో సుమారు రూ.1,000 కోట్లు నేరుగా జమయ్యాయని అన్నారు. 2014 ఎన్నికల సమయంలో మహిళా సంఘాల రుణాలను మాఫీ చేస్తామని చంద్రబాబునాయుడు మాయమాటలు చెప్పి మహిళలతో ఓట్లు వేయించుకున్నారని, తీరా అధికారంలోకి వచ్చిన తర్వాత మహిళలను నిలువునా మోసం చేశారని గుర్తుచేశారు. ఎన్నికల సమయం వస్తోందని మళ్లీ మాయమాటలు చెప్పి మోసం చేసేందుకు టీడీపీ పగటి వేషగాళ్లు వస్తారని, వారికి మీరే తగిన బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. అన్ని వర్గాల ప్రజల సంక్షేమమే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ధ్యేయమని, ఆయన్ని ప్రతీ అక్క,చెల్లెమ్మ దీవించాలని కోరారు. రాష్ట్ర కొప్పల వెలమ కార్పొరేషన్ చైర్మన్ నెక్కలి నాయుడుబాబు మాట్లాడుతూ ప్రతీ కుటుంబానికి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి స్థిరమైన ఆస్తిని అందిస్తున్నారని తెలిపారు. అనంతరం మూడోవిడత ఆసరా చెక్కు అక్కచెల్లమ్మలకు ఎమ్మెల్యే, ఇతర ప్రజాప్రతినిధులు అందజేశారు. ఎంపీపీ నీలంశెట్టి గోపెమ్మ, జెడ్పీటీసీ నెక్కలి శ్రీదేవి, వైస్ ఎంపీపీ కర్రి శ్రీను, పీఏసీఎస్ అధ్యక్షుడు గొరపల్లి శివ, జేసీఎస్ మండల కన్వీనర్ బొంతల వెంకటరావు, సర్పంచులు మచ్చ ఎర్రా రామస్వామి, విరోతి కొండలరావు, పీతల కృష్ణ, పార్టీ నాయకులు మదీన అప్పలరమణ, పి.ఎస్.ఎన్. ప్రాత్రుడు, రామన్నపాత్రుడు, ఎంపీడీఓ వై.పద్మజ, వెలుగు ఏపీఎంలు శ్రీనివాసరావు,రొంగలి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు ఎల్.కోటలో..

లక్కవరపుకోట మండల కేంద్రంలోని చెరుకు కాటా వద్ద వైఎస్సార్ ఆసరా మూడో విడత పంపిణీ కార్యక్రమం మంగళవారం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ కె.రూపేష్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందని, ముఖ్య అతిథిగా జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు హాజరవుతారని పేర్కొన్నారు. డ్వాక్రా సంఘాల మహిళలంతా తరలిరావాలని కోరారు.

ఇచ్చిన మాట నిలబెట్టుకున్నారు



డ్వాక్రా సంఘాలకు నాలుగు విడతల్లో రుణ మాఫీ డబ్బులు అందిస్తామని ఎన్నికలకు ముందు జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన మాటను ముఖ్యమంత్రి అయిన తర్వాత నిలబెట్టుకున్నారు. ఏడాదికి రూ.10,300 చొప్పున ఇప్పటి వరకు మూడు విడతల్లో నా ఖాతాలో రూ.30,900 జమయింది. ఈ సొమ్ముతో పాటు ప్రభుత్వం ప్రోత్సాహంతో ఎలక్ట్రానిక్స్ షాపును పెట్టుకొని కుటుంబాన్ని పోషించుకుంటున్నాను.

– కదాలి లక్ష్మి, కుమ్మరవీధి, కొత్తవలస మండలం

రుణపడి ఉంటాం..



జగనన్న ఇప్పటి వరకు ఆసరా పథకంలో భాగంగా ఒక్కో విడతలో రూ. 11,600 చొప్పున మూడు విడతల్లో నాఖాతాలో రూ.34,800 జమయ్యాయి. ప్రస్తుతం పూజా సామగ్రి షాపు పెట్టుకున్నాను. స్వయం ఉపాధి కల్పించిన జగనన్నకు రుణపడి ఉంటాం. – బి.స్వర్ణలత,కొత్తవలస

ఆర్థిక భరోసా దక్కింది



ఇచ్చిన మాట ప్రకారం రుణమాఫీ నిధులను విడుదల చేస్తున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు. నాకు మూడు విడతల్లో ఆసరా పథకం డబ్బులు రూ.51,150 వచ్చాయి. ఈ సొమ్ముతో టైలరింగ్ షాపు నడుపుతున్నాను. మాకుటుంబానికి ఆర్థిక భరోసా దక్కింది.

– కె.కళావాణి, 202–కాలనీ,కొత్తవలస మండలం

ప్రజాసమస్యలు పరిష్కరించేందుకే 'స్పందన'



దత్తిరాజేరు: వినతులు స్వీకరిస్తున్న మండల అధికారులు



బొండపల్లి: అధికారులకు వినతిపత్రం అందజేస్తున్న రైతు



గజపతినగరం: అధికారులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ సుదర్శనం

దత్తిరాజేరు: ప్రజా సమస్యలను పరిష్కరించేందుకే మండల పరిషత్ కార్యాలయంలో ప్రతీ సోమవారం 'స్పందన' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని ఎంపీడీఓ సుబ్రహ్మణ్యం తెలిపారు. సోమవారం నిర్వహించిన స్పందనలో రెండు అర్జీలు అందాయని ఆయన చెప్పారు. కలెక్టర్ ఆదేశాల మేరకు స్పందన కార్యక్రమం నిర్వహిస్తున్నామని, మండలంలోని 35 గ్రామాల ప్రజలూ ఏసమస్య ఉన్నా నేరుగా కార్యాలయానికి వచ్చి అర్జీలు అందించవచ్చని సూచించారు. అన్ని శాఖల మండల అధికారులు ప్రతీ సోమవారం ఉదయం ఎంపీడీఓ కార్యాలయంలో అందుబాటు లో ఉండి, ప్రజల నుంచి అర్జీలు స్వీకరించి, వాటికి పరిష్కారం చూపిస్తారని చెప్పారు. వైద్యాధికారి సతీష్, ఏపీఎం, అచ్యుతరావు, ఈఓపీఆర్డీ వాణిశ్రీ, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

'స్పందన'పై ప్రజలకు అవగాహన కల్పించండి

గజపతినగరం: మండల పరిషత్ కార్యాలయంలో ప్రతీ సోమవారం నిర్వహించే ప్రజాసమస్యల పరిష్కార వేదిక 'స్పందన' కార్యక్రమం పై గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పించాలని ఇన్‌చార్జి ఎంపీడీఓ పప్పు సుదర్శనం పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం స్పంద న నిర్వహించి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. అనంతరం ఆయన మండల అధికారులు, పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని, ప్రజాసమస్యలను పరిష్కరించాలని సూచించారు. తహసీల్దార్ ఎం.అరుణకుమారి, మరుపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారులు అనూజ్ రాయ్, కె.పుష్పాంజలి, తుమికాపల్లి, మరుపల్లి వెటర్నరీ డాక్టర్లు శశిభూషణ్‌రావు, వెంకటరమణ, ఉద్యానవన,వ్యవసాయ,తదితర శాఖల అధికారులు, గ్రామ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అధికారులకు మెమోలు జారీ

బొండపల్లి: మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహిస్తున్న స్పందన కార్యక్రమానికి తరచూ హాజరు కాని అధికారులకు మెమోలు జారీ చేయడంతో పాటు వారిపై జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేయనున్నట్లు ఎంపీడీఓ ఏ.వేదవతి తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహించారు. రయింద్రాం గ్రామానికి చెందిన రైతు కిలపర్తి చిన్నంనాయుడు తనకు రైతు భరోసా అందడం లేదని వినతి పత్రం అందజేశారు. సమస్యను పరిష్కరించాలని ఏఓ మల్లికార్జునరావుకు ఎంపీడీఓ సూచించారు.తహసీల్దార్ శ్రీనివాస్ మిశ్రా తదితరులు పాల్గొన్నారు.

నేడు 'గడప గడపకు మన ప్రభుత్వం'

కొత్తవలస: మండల కేంద్రంలోని సబ్బవరం రోడ్డులో గవరపాలెం, మిందివలసలో 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం మంగళవారం మధ్యాహ్నం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ వై.పద్మజ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు పాల్గొంటారని, కార్యక్రమానికి మండల అధికారులు, ఆయా ప్రాంతాల సచివాలయ సిబ్బంది, వలంటీర్లు హాజరు కావాలని సూచించారు.

పెరటికోళ్ల పంపిణీ



మహిళలకు పెరటి కోళ్లు అందజేస్తున్న నాయకులు, వెలుగు సిబ్బంది

మెరకముడిదాం: డ్వాక్రా సంఘాల్లోని మహిళలకు స్థానిక వెలుగు కార్యాలయంలో మాజీ ఎంపీపీ తాడ్డి వేణుగోపాలరావు, మాజీ జెడ్పీటీసీ కోట్ల విశ్వేశ్వరరావు, నాయకులు కె.ఎస్.ఆర్.కె.ప్రసాద్ పెరటికోళ్లను సోమవారం పంపిణీ చేశారు. ఏపీఎం లెంక కామేశ్వరరావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో నాయకులు మాట్లాడుతూ మహిళల ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వం అనేక పథకాలు అమలు చేస్తోందని చెప్పారు. ప్రభుత్వం కల్పిస్తున్న రుణసదుపాయాలు, పథకాలను సద్వినియోగించుకుని మహిళలు చిరువ్యాపారాలు చేసేకుంటూ, కుటీర పరిశ్రమలు ఏర్పాటు చేసుకొని ఆర్థిక ప్రగతి సాధించాలని సూచించారు. మండలానికి చెందిన పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వెలుగు సీసీలు, డ్వాక్రా సంఘాల మహిళలు పాల్గొన్నారు.

భూరీసర్వే పనుల పరిశీలన



సర్వే పనులను పరిశీలిస్తున్న తహసీల్దార్ సురేష్

చీపురుపల్లిరూరల్: మండలంలోని పత్తికాయవలస గ్రామంలో వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు, భూరక్ష పథకంలో భాగంగా చేపడుతున్న భూరీసర్వే పనులను తహసీల్దార్ ఎం.సురేష్ సోమవారం పరిశీలించారు. ఈసందర్భంగా రెవెన్యూ, సర్వే సిబ్బందికి ఆయన పలు సూచనలు చేశారు. పక్కాగా, పారదర్శకంగా సర్వే చేయాలని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న సమగ్ర భూరీసర్వే కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని, సిబ్బంది సర్వే చేసే సమయంలో పొలాల వద్ద ఉండి సహకరించాలని రైతులను కోరారు. భూసమస్యలను పరిష్కరించేందుకే సమగ్ర భూరీసర్వే చేపడుతున్నట్లు తెలిపారు. సర్వేను త్వరగా పూర్తి చేయాలని సర్వేయర్లకు సూచించారు.

ఉత్తమ ఫలితాలతో ఉజ్వల భవిష్యత్



విద్యార్థులకు జ్ఞాపికలు అందజేస్తున్న ఎస్ఐ దేవి

కొత్తవలస: విద్యార్థి జీవితంలో 10వ తరగతి ఎంతో కీలకమైనదని, ఇక్కడ ఉత్తమ ఫలితాలు సాధించి బంగారు భవిష్యత్‌కు బాటలు వేసుకోవాలని ఎస్ఐ బొడ్డు దేవి సూచించారు. ఎస్ఎఫ్ఐ, యూటీఎఫ్ సంఘాల ఆధ్వర్యంలో 10వ తరగతి విద్యార్థులకు పబ్లిక్ పరీక్షలపై భయం పోగొట్టేందుకు జిల్లా వ్యాప్తంగా ప్రజ్ఞావికాస పరీక్షలను ఇటీవల నిర్వహించారు. ఈపరీక్షలకు 1,200 మంది విద్యార్థులు హాజరు కాగా మొదటి మూడుస్థానాలు కొత్తవలస మండలానికి చెందిన విద్యార్థులుసాధించారు. స్థానిక మోడల్ స్కూల్‌లో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో ఈ విద్యార్థులకు ఎస్ఐ దేవి నగదు బహుమతులు, జ్ఞాపికలు అందజేశారు. ఎస్ఎఫ్ఐ నాయకుడు ఎం.హర్ష మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా పరీక్షలు రాయండి



విద్యార్థులకు పెన్నులు, ప్లాంకులు పంపిణీ చేస్తున్న నాయకులు, ధీర ఫౌండేషన్ ప్రతినిధులు

మెరకముడిదాం: విద్యార్థులు అనవసరంగా ఒత్తిడికి లోనుకాకుండా భయం వీడి ప్రశాంతంగా పబ్లిక్ పరీక్షలు రాయాలని పదోతరగతి విద్యార్థులకు విజయనగరానికి చెందిన ధీర ఫౌండేషన్ ప్రతినిధులు సూచించారు. మండలంలోని సాతాంవ లస, గరుగుబిల్లి ఉన్నతపాఠశాలల 10 వతరగతి విద్యార్థులకు ధీరఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్లాంకులు, పెన్నులు, పరీక్షా సామగ్రిని స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి సోమవారం అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ పబ్లిక్ పరీక్షలని అనవసరంగా ఆందోళన చెందవద్దని, ఇప్పటివరకు చదువుకున్న పాఠాలను పునశ్చరణ చేసుకోవాలని సూచించారు. నాయకులు రామశివ, కృష్ణంరాజు, రామకృష్ణ మాస్టారు, శంకర్, బాలిమహేష్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కార్పెంటర్ల ఉచితసేవలు



ఎంపీడీఓ కార్యాలయంలో ఫర్నీచర్ మరమ్మతులు చేస్తున్న కార్పెంటర్లు

గజపతినగరం: స్థానిక తహసీల్దార్, మండలపరిషత్ తదితర ప్రభుత్వ కార్యాలయాల్లో ఫర్నీచర్‌కు కార్పెంటర్లు సోమవారం ఉచితంగా మరమ్మతులు చేశారు. కార్పెంటర్స్‌డే సందర్భంగా మండల వీరబ్రహ్మేంద్ర స్వామి కార్పెంటర్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు కె.అప్పలాచారి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఇన్‌చార్జి ఎంపీడీఓ పప్పు సుదర్శనం, జెడ్పీటీసీ గార తవుడు, డిప్యూటీ తహసీల్దార్ సత్యనారాయణ కార్పెంటర్లకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో కార్పెంటర్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి అండ్లూరి గణేష్, ట్రెజరర్ సింహాద్రి సన్యాసిరావు, డి.గౌరీశంకర్ రావు, పి.సన్యాసిరావు, కె.కృష్ణ, పి.సూరిబాబు, వీరాచారి, నారాయణరావు, పారాది శ్రీను తదితరులు పాల్గొన్నారు.

పీఏసీఎస్‌ను అభివృద్ధి పథంలో నడిపించాలి

- గూడెం పీఏసీఎస్ భవనాలను ప్రారంభించిన మంత్రి బొత్స



గుర్ల: పీఏసీఎస్ భవనాలను ప్రారంభిస్తున్న మంత్రి బొత్స సత్యనారాయణ, ప్రజాప్రతినిధులు




చీపురుపల్లి: బస్ షెల్టర్‌ను ప్రారంభిస్తున్న మంత్రి బొత్స సత్యనారాయణ

గుర్ల: మండలంలోని గూడెం జంక్షన్ వద్ద నిర్మించిన ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం(పీఏసీఎస్) నూతన భవనాలను రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎంపీ బెల్లాన చంద్రశేఖర్‌తో కలిసి సోమవారం ప్రారంభించారు. రూ.48 లక్షలతో పీఏసీఎస్‌కు అవసరమైన అన్ని భవనాలను నిర్మించామని, రైతులంతా గూడెం సొసైటీని అభివృద్ధి పథంలో నడిపించాలని కోరారు. కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ చినరామునాయుడు, డీసీసీబీ సీఈఓ జనార్దన్, ఎంపీపీ పొట్నూరు ప్రమీల, జెడ్పీటీసీ శీర అప్పలనాయుడు, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.వి. సూర్యనారాయణరాజు, పొట్నూరు సన్యాసినాయు డు, తోట తిరుపతిరావు, అంబల్ల చిన్నారావు, బెల్లాన వెంకటరమణ, రెడ్డి మురళి తదితరులు పాల్గొన్నారు.

బస్ షెల్టర్ ప్రారంభం

చీపురుపల్లి: పట్టణంలోని ప్రభుత్వ ఆదర్శ డిగ్రీ కళాశాల వద్ద ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ తన ఎంపీ ల్యాడ్స్ నిధులను వెచ్చించి రూ.5 లక్షలతో నిర్మించిన బస్ షెల్టర్‌ను రాష్ట్ర విద్యాశాఖా మంత్రి బొత్స సత్యనారాయణ సోమవారం ప్రారంభించారు. కళాశాల విద్యార్థులు, అధ్యాపకులు విజ్ఞప్తి మేరకు ఇక్కడ బస్ షెల్టర్ నిర్మాణానికి ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ ఎంపీ ల్యాడ్స్ నిధులు మంజూరు చేశారు.కార్యక్రమంలో జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, ఎంపీపీ ఇప్పిలి వెంకటనర్సమ్మ, జెడ్పీటీసీ వలిరెడ్డి శిరీష, మేజర్ పంచాయతీ సర్పంచ్ మంగళగిరి సుధారాణి, వైఎస్సార్‌సీపీ నాయకులు ఇప్పిలి అనంతం, వలిరెడ్డి శ్రీనివాసనాయుడు, బెల్లాన వంశీకృష్ణ, కళాశాల ప్రిన్సిపాల్, ఆర్‌జేడీ డా.పివి.కృష్ణాజీ తదితరులు పాల్గొన్నారు.

యర్రమ్మ పేరాంటాల తీర్థం



పూజలందుకుంటున్న అమ్మవారు

జామి: మండల కేంద్రంలో యర్రమ్మ పేరాంటాల తీర్థం సోమవారం ఘనంగా నిర్వహించారు. భక్తులు అమ్మవారికి పసుపు, కుంకుమ, గాజులు, చీర, రవికలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఏటా ఏరువాక రోజు అమ్మవారి తీర్థం నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. తీర్థం సందర్భంగా ఆలయం వద్ద కోలాటం తదితర సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వాహకులు ఏర్పాటు చేశారు.

రంగస్థల కళాకారులకు ఆర్థిక సాయం

విజయనగరం: ప్రపంచ రంగస్థల దినోత్సవ సందర్భంగా 'గోల్డెన్ హెరిటేజ్ ఆఫ్ విజయనగరం చారిటబుల్ ఫౌండేషన్' సంస్థ ఆధ్వర్యంలో ముగ్గురు రంగస్థల కళాకారులను సోమవారం సాయంత్రం సత్కరించి, ఆర్థిక సహాయం అందజేశారు. స్థానిక కోట జంక్షన్ వద్ద గల ఆనంద్ ఎన్‌క్లేవ్ వద్ద జరిగిన ఈ కార్యక్రమంలో బేల పద్మశ్రీ, రాజు, కర్రోతు జగ్గారావులను సత్కరించి, ఒక్కొక్కరికీ మూడు వేల రూపాయల చొప్పున నగదు అందజేసినట్లు సంస్థ వ్యవస్థాపక అధ్యక్షురాలు రాధిక మంగిపూడి తెలిపారు. కార్యక్రమంలో సంస్థ ప్రధాన కార్యదర్శి భోగరాజు సూర్యలక్ష్మి, ఉపాధ్యక్షుడు కేఆర్‌కే రాజు, కుటుంబరావు, ఝాన్సీ, రుక్మిణి, సంగీతకుమార్, తదితరులు పాల్గొన్నారు.

నియామకపత్రాలు అందజేత



వలంటీర్ల నియామకపత్రాలను సచివాలయ కార్యదర్శికి అందజేస్తున్న ఎంపీపీ హైమావతి

గంట్యాడ: మండలంలోని దిగువ కొండపర్తి, పెదవేమలి గ్రామ సచివాలయాల పరిధిలో నూతనంగా నియమితులైన గ్రామ వలంటీర్లకు సంబంధించిన నియామక పత్రాలను సచివాలయాల కార్యదర్శులకు ఎంపీపీ పీరుబండి హైమావతి స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం అందజేశారు. వలంటీర్లకు తమ విధులను వివరించి, ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా పనిచేయాలని వివరించాలని సచివాలయ కార్యదర్శులకు ఆమె సూచించారు. వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు పీరుబండి జైహింద్‌కుమార్, ఎంపీడీఓ భవాని పాల్గొన్నారు.

200 రోజులు పని కల్పించండి



ఎంపీడీఓ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న వేతనదారులు, వివిధ సంఘాల నాయకులు

శృంగవరపుకోట: ఉపాధి హామీ పథకంలో భాగంగా వేతనదారులకు ఏడాదికి 200 రోజులు పనిదినాలు కల్పించాలని, రోజువారీ వేతనం రూ.600 చెల్లించాలని సీఐటీయూ, వ్యవసాయ కార్మిక సంఘం నేతలు డిమాండ్ చేశారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద వేతనదారులతో కలిసి సోమవారం నిరసన తెలిపారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ రెండు పూటలా పనులు చేసే విధానాన్ని రద్దు చేయాలని తదితర డిమాండ్లతో ఎంపీడీఓ శేషుబాబుకు వినతిపత్రం అందజేశారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు తమ్మినేని సూర్యనారాయణ, జిల్లా ప్రధాన కార్యదర్శి కాకి సురేష్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు గాడి అప్పారావు, జిల్లా కార్యదర్శి మద్దిల రమణ, సీఐటీయూ మండల కమిటీ నాయకులు సీహెచ్.ముత్యాలు తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ రిజర్వేషన్ల తీర్మానం నిలిపివేయాలి



ఆర్డీఓ కార్యాలయంలో డీటీకి వినతిపత్రం అందజేస్తున్న విశ్వహిందూ పరిషత్ ప్రచారక్‌లు

చీపురుపల్లి: దళిత క్రైస్తవులకు ఎస్సీలుగా రిజర్వేషన్లు కల్పించాలని ప్రభుత్వం చేసిన తీర్మానం నిలిపివేయాలని విశ్వ హిందూ పరిషత్ చీపురు పల్లి, గరివిడి మండలాల ప్రచారక్‌లు ప్రేమ్‌కుమార్ వర్మ, శంకరరావు కోరారు. ఈమేరకు స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ దళిత క్రైస్తవులకు ఎస్సీలుగా రిజర్వేషన్లు కల్పించడం ద్వారా మత మార్పిడికి ప్రోత్సహిస్తున్నట్లు అవుతుందన్నారు. అందుకనే ఈ తీర్మానాన్ని నిలిపివేయాలని కోరారు.